సాక్షి సూర్యాపేట

శుక్రవారం । 11 । ఆగస్టు । 2023



జేఎల్ఎం పోస్టుల భర్తీకి..
విద్యుత్ శాఖలో 335 జూనియర్ లైన్‌మెన్ (జేఎల్ఎం) పోస్టుల భర్తీకి ఆ శాఖ షెడ్యూల్ విడుదల చేసింది.
- 8లో



విద్యారంగాన్ని పరిరక్షించాలి
విద్యారంగాన్ని పరిరక్షించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్.మూర్తి తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
- 8లో



పందెం గిత్తల ఖరీదు రూ.కోటి
పందెం గిత్తలపై ఉన్న మోజుతో జత గిత్తలను రూ.కోటి పెట్టి కొనుగోలు చేశారు ఏపీలోని బాపట్ల జిల్లా వాసి.
- 8లో

న్యూస్‌రీల్

అభివృద్ధి పనుల్లో అలసత్వం వహించొద్దు



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ సురేష్

చివ్వెంల(సూర్యాపేట) : గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల విషయంలో అధికారులు అలసత్వం వహించవద్దని జిల్లా పరిషత్ సీఈఓ సురేష్ సూచించారు. చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై గురువారం చివ్వెంల మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మి, ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్‌రావు, ఎంపీఓ గోపి, ఏపీఓ నాగయ్య, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



ధర్నా నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ప్రభుత్వ విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి తెలకలపల్లి పెంటయ్య కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం టీపీఎస్‌యూ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యా శాఖలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లోని అన్ని కేటగిరీల ఉపాధ్యాయులు, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు అనేక సమస్యలతో సతమతం అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలు మౌలిక వసతులులేక, పారి శుద్ధ్య కార్మికులు లేక అపరిశుభ్రంగా మారుతున్నాయన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలన్నింటిపై దృష్టి సారించాలన్నారు. ధర్నా అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీపీయూఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెల్లంకొండ రామమూర్తి, జిల్లా అధ్యక్షురాలు పర్వతం సంధ్యా రాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి యామా రమేశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లింగంపల్లి హరి ప్రసాద్, గోదేశి రామారావు, బ్రహ్మచారి, పరంజ్యోతి, యాణాల వెంకట్ రెడ్డి, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులో మాదిగల విశ్వరూప మహాసభ



అభివాదం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

పెన్‌పహాడ్: ఈనెలాఖరులో హైదరాబాద్‌లో మాదిగల విశ్వరూప మహాసభ నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ తూరుగంటి అంజయ్య తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని సత్య గార్డెన్స్‌లో పుట్టల మల్లేష్ అధ్యక్షతన గురువారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సీనియర్ నాయకులు ఎర్ర వీరస్వామి, విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి కరుణాకర్, ములకలపల్లి రవి, నందిపాటి భాస్కర్, ఎరకచర్ల శ్రీనివాస్, ఒగ్గు ప్రవీణ్, కొండమీది సోమయ్య, నగేష నరేష్, భిక్షం పాల్గొన్నారు.

బంగారు తాపడానికి కమిటీ నియామకం

సాక్షి, యాదాద్రి: యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయ విమాన గోపురం బంగారు తాపడం పనుల కోసం దేవాదాయ శాఖ గురువారం కమిటీని ఏర్పాటు చేసింది. 125 కిలోల బంగారాన్ని భక్తుల నుంచి సేకరించి స్వామివారి ప్రధాన ఆలయ విమాన గోపురానికి బంగారు తాపడం చేయనున్నారు. కమిటీలో ప్రభుత్వ కార్యదర్శి కె.ఎస్.శ్రీనివాస రాజు, వైటీడీఏ వైస్ చైర్మన్ జి.కిషన్‌రావు, ఆర్థిక శాఖ సీనియర్ సలహాదారు ఎస్.శివశంకర్, దేవాదాయ శాఖ కార్యదర్శి అనిల్‌కుమార్, యాదాద్రి ఆలయ ఈఓ గీతారెడ్డి ఉన్నారు. వీరి పర్యవేక్షణలో విమాన గోపురం బంగారు తాపడం పనులను చేపట్టనున్నారు.

అండర్‌పాస్ గుబులు

- 930(పీ) విస్తరణలో తిరుమలగిరి క్రాస్‌రోడ్డులో అండర్‌పాస్
- 1.5కిలోమీటర్ల మేర నిర్మాణం
- వ్యాపారాలు దెబ్బతింటాయని ఆందోళన
- ఇళ్లకు నష్టం వాటిల్లుతుందని యజమానుల ఆవేదన
- బ్రిడ్జి నిర్మించవద్దని రోడ్డు మాత్రమే విస్తరించాలని వేడుకోలు



తిరుమలగిరి పట్టణంలో అండర్‌పాస్ నిర్మించనున్న క్రాస్ రోడ్డు

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి పట్టణ ప్రజలకు అండర్‌పాస్ గుబులు పట్టుకుంది. హైవే 930(పి) నిర్మాణంలో భాగంగా తిరుమలగిరి క్రాస్‌రోడ్డులో చేపట్టే అండర్‌పాస్‌తో వ్యాపారాలు దెబ్బతింటాయని ఇటు వ్యాపారులు, జంక్షన్ ఇంప్రూవ్‌మెంట్ వల్ల ఇళ్లు నష్టపోతామని గృహ యజమానులు ఆందోళన చెందుతున్నారు. రోజూ లక్షల రూపాయలు కోల్పోవాల్సి వస్తుందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ఉపాధిపై ప్రభావం చూపుతుందని చిరు వ్యాపారులు సైతం దిగులు చెందుతున్నారు.

వలిగొండ– తొర్రూరు రహదారిపై..

హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు (గౌరెల్లి నుంచి) నుంచి భద్రాద్రి కొత్తగూడెం వరకు 930(పీ) హైవేను రెండులేన్లుగా నిర్మాణం చేస్తున్నారు. ప్రస్తుతం యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ జంక్షన్ నుంచి మహబూబాబాద్ జిల్లా తొర్రూరు వరకు 69కి.మీ. మేర ఈ రహదారిని డబుల్‌లేన్‌గా విస్తరించనున్నారు. రూ.549 కోట్లతో దీనిని నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగానే తిరుమలగిరి పట్టణంలోని క్రాస్‌రోడ్డులో వలిగొండ–తొర్రూరు ప్రధాన రహదారిపై ఒకటిన్నర కిలో మీటర్ల వెహికిల్ అండర్ పాస్ (బ్రిడ్జి) నిర్మించనున్నారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్ల యజమానులు ఆందోళన చెందుతున్నారు. సుమారు 10 నుంచి 20 ఇళ్లకు నష్టం జరగుతుందని సమాచారం. జంక్షన్ ఇంప్రూవ్‌మెంట్ కింద మరికొన్ని ఇళ్లు కూడా నష్టపోతామని, తాము దుకాణాలకు అద్దెకు ఇచ్చిన మడిగెలకు కిరాయిలు కూడా సరిగా రావని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్రాస్‌రోడ్డులో హోటళ్లు, కిరాణదుకాణాలు, జనరల్ స్టోర్స్, బార్లు, వైన్స్, హాస్పిటళ్లు ఉన్నాయి. అలాగే సుమారు 100 మంది చిరువ్యాపారులు టీ, టిఫిన్ సెంటర్లు, పాన్‌షాపులు, చేపలు, కూరగాయలు, పాలు, పండ్లు, పూలు తదితర వస్తువులు అమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వాహనాల్లో వచ్చే ప్రయాణికులు స్థానిక చౌరస్తాలో దిగి హోటళ్లు, రెస్టారెంట్లు, దుకాణాలకు వెళ్లేవారు. తమ అవసరం మేరకు వస్తువులను సైతం కొనుగోలు చేసుకునేవారు. దీంతో రోజుకూ సుమారు రూ.15లక్షల నుంచి రూ.20లక్షల వరకు వ్యాపారం జరుగుతోందని అంచనా. బ్రిడ్జి నిర్మాణం జరిగితే వ్యాపారాలు పూర్తిగా దెబ్బతింటాయన్న బెంగపట్టుకుంది.

పడిపోయిన స్థలం ధరలు

క్రాస్ రోడ్డుకు ఇరువైపులా గతంలో స్థలం విలువ గజం రూ.30 వేల నుంచి రూ.70 వేల వరకు పలికింది. ఇక బ్రిడ్జి నిర్మాణం జరుగుతుందని ప్రచారం జరుగుతుండడంతో సగం ధరకు కూడా అడిగే పరిస్థితి లేకుండా పోయింది. ఒక్కో షాపుకు రూ.20వేల నుంచి రూ.30వేల వరకు కిరాయిలు, రూ.5లక్షల వరకు అడ్వాన్స్ ఇచ్చారు. కానీ బ్రిడ్జి నిర్మిస్తే షాపుల కోసం అద్దెలకు తీసుకునేవారే కరువయ్యే పరిస్థితులుంటాయని అంటున్నారు. క్రాస్‌రోడ్డు ప్రాంతంలో ఇళ్లు అద్దెలకు తీసుకునే వారు కరువవుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చౌరస్తాలో బ్రిడ్జి నిర్మించకుండా రోడ్డు వెడల్పు చేస్తే బాగుంటుందని ఇళ్ల యజమానులు, వ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు.

క్రాస్‌రోడ్డులో బ్రిడ్జి నిర్మించొద్దు



తిరుమలగిరి పట్టణంలోని క్రాస్ రోడ్డులో అండర్ పాస్ నిర్మించడం వల్ల గ్రామ రూపురేఖలే మారిపోతాయి. వ్యాపారాలు సాగక వందలాది కుటుంబాలు వీధిన పడతారు. ఆర్థికంగా నష్ట పోతారు. బ్రిడ్జి నిర్మించక పోతేనే మేలు జరుగుతుంది.

– సామ అంజనేయులు, వ్యాపారి

రోడ్డు వెడల్పు మాత్రమే చేయాలి



డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టినా చౌరస్తాలో రోడ్డు వెడల్పు మాత్రమే చేయాలి. బ్రిడ్జి వేస్తే ఇంటి యజమానులు పూర్తిగా నష్ట పోతారు. వ్యాపారాలు కూడా దెబ్బ తింటాయి. చౌరస్తా మొత్తం బోసి పోతుంది.

– బత్తుల శ్రీనివాస్, ఇంటి యజమాని, తిరుమలగిరి.

కుటుంబాలు వీధిన పడతాయి



ఇరవై సంవత్సరాలుగా చౌరస్తాలో రోడ్డు పక్కనే పండ్ల బండి పెట్టుకొని జీవనం సాగిస్తున్నాం. బ్రిడ్జి నిర్మాణం అయితే దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు ఎవ్వరూ ఇక్కడ ఆగకుండా వెళ్లి పోతారు. దీంతో వ్యాపారాలు సాగవు. వీధి వ్యాపారాలు మొత్తం దెబ్బ తింటాయి.

– ప్రకాష్, పండ్ల బండి వ్యాపారి.

సిరిపురం వద్ద కూలిన ఎడమ కాల్వ లైనింగ్



సాగర్ ఎడమ కాల్వలో పడిపోయిన చెట్టు

నడిగూడెం : నడిగూడెం మండల పరిధిలోని సిరిపురం వద్ద 124 కిలో మీటరు సమీపాన ఎల్ 35 ఎత్తిపోతల పథకం వద్ద సాగర్ ఎడమ కాల్వ డీప్‌కట్ లైనింగ్ గురువారం కూలింది. దీంతో కట్టవెంట ఉన్న పెద్ద చెట్టు కాల్వలో పడింది. దీనికారణంగా నీటి వేగం తగ్గే అవకాశముందని రైతులు చెబుతున్నారు. ఆ డీప్ కట్ సమీపాన అనేక చోట్ల బుంగలు పడి ఉన్నాయని, పలు చోట్ల కాల్వ లైనింగ్ కోతకు గురవుతోందని పేర్కొన్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని సిరిపురం, నారాయణపురం గ్రామాల రైతులు కోరుతున్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : దేశంలో మహిళలకు రక్షణ కల్పించాలని పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్‌లు డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ, పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో గురువారం సూర్యాపేట పట్టణంలో నిరసన ర్యాలీ నిరసన ర్యాలీ నిర్వహించిన అనంతరం మాట్లాడారు. మణిపూర్ రాష్ట్రంలో రెండు తెగల మధ్య జరుగుతున్న గొడవలో తక్కువ జాతికి(కుకి) చెందిన మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేసి హత్య చేయడం యావత్ 140 కోట్ల భారతదేశ ప్రజానీకాన్ని ప్రపంచ దేశాల ముందు తలదించుకునేలా చేసిందన్నారు. అధికారంలో ఉన్న బీజేపీ ఈ గొడవలు సద్దుమణిగేలా చేయడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ, ఉపాధ్యక్షురాలు రేణుక, కోశాధికారి జయమ్మ, పీడీఎస్‌యు నాయకులు శైలజ, రమణ, మానస, లక్ష్మి, దేవి, రమణ, పద్మ, శోభ తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మిని నిరంతరం కొనసాగించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : గృహలక్ష్మి పథకం కింద దరఖాస్తు ప్రక్రియను నిరంతరం కొనసాగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు కోరారు. గురువారం కలెక్టరేట్‌లో ఏఓ సుదర్శన్ రెడ్డికి పార్టీ జిల్లా కమిటీ పక్షాన వినతి పత్రం అందజేసి మాట్లాడారు. గృహలక్ష్మి పథకం కింద రూ.5లక్షలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి కావాలిసిన ఇసుకను ప్రభుత్వ ఉచితంగా ఇవ్వాలని, తక్కువ ధరకు ప్రభుత్వం ద్వారా సిమెంట్ అందించాలన్నారు. పట్టాలు లేని ఇంటి స్థలాలు, ప్రభుత్వ భూముల్లో ఉన్న వారికి అవకాశం కల్పించాలన్నారు. కుటుంబ సభ్యుల్లో ఎవరు పేరు మీద ఉన్నా మహిళల పేరున మార్పిడి చేసుకోవడానికి గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలకు అనుమతులు ఇచ్చి ఉచితంగా మార్పు చేయించాలన్నారు. కార్యక్రమంలో బూర వెంకటేశ్వర్లు, నిమ్మల ప్రభాకర్, గోపగాని రవికుమార్, బొల్లు ప్రసాద్, మాతంగి ప్రసాద్, రామకృష్ణ పాల్గొన్నారు.

• ఆశ కార్యకర్తల ర్యాలీ



సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు గురువారం సూర్యాపేట పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా వైద్యాధికారి కార్యాలయం ఎదుట ధర్నా చేశారు.

సూర్యాపేటలో ఆటోనగర్ ఏర్పాటుకు చర్యలు

- కలెక్టర్ వెంకట్రావు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు

సూర్యాపేట: జిల్లా కేంద్రంలో ఆటోనగర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఎస్.వెంకట్రావు తెలిపారు. ఆటోనగర్ ఏర్పాటులో భాగంగా సూర్యాపేట మండలంలోని ఇమాంపేట, చివ్వెంల మండలంలోని ఉండ్రుగొండ ప్రాంతాల్లో కేటాయించిన భూములను టీఎస్ఐఐసీ జనరల్ మేనేజర్ శారద గురువారం పరిశీలించారు. అనంతరం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆటోనగర్ ఏర్పాటుకు ఇమాంపేట సమీపంలో 33.24 ఎకరాల భూమిని తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్టక్చర్ కార్పొరేషన్‌కు కేటాయించామని, ఇంకా 69 ఎకరాల భూమిని ల్యాండ్ ఎక్విజేషన్ చేయాల్సి ఉందన్నారు. త్వరలోనే ల్యాండ్ ఎక్విజేషన్ పూర్తిచేసి టీఎస్ఐఐసీకి భూములు కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వీరబ్రహ్మచారి, తహసీల్దార్లు శ్యామ్ సుందర్‌రెడ్డి, రంగారావు, జిల్లా ల్యాండ్ సర్వే అధికారి నాగేందర్ పాల్గొన్నారు.

సన్నబియ్యంతో భోజనం

- అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించేందుకు అధికారుల సన్నాహాలు
- దొడ్డు బియ్యం అయిపోగానే సరఫరా
- 57,023 మందికి ప్రయోజనం



అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న చిన్నారులు, గర్భిణులు (ఫైల్)

నాగారం : అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. పూర్వ ప్రాథమిక విద్యను అందించడంతోపాటు పిల్లల్ని ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆటపాటల ద్వారా విద్యాబోధన చేయడంతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్నారు. ఈ క్రమంలోనే అంగన్‌వాడీ కేంద్రాలకు సైతం సన్నబియ్యం సరఫరాకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే క్షేత్రస్థాయిలో ప్రణాళికను పూర్తి చేశారు. ప్రస్తుతం ఆయా కేంద్రాల్లో ఉన్న దొడ్డు బియ్యం అయిపోగానే నేరుగా పౌర సరఫరాల గోదాముల నుంచి పంపిణీ చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకున్నారు.

ఐసీడీఎస్ ప్రాజెక్టులు	05
అంగన్‌వాడీ కేంద్రాలు	1209
గర్భిణులు	6270
బాలింతలు	5221
0 నుంచి 3 సంవత్సరాల పిల్లలు	28700
3 నుంచి 6 సంవత్సరాల పిల్లలు	16832

దొడ్డు రకం బియ్యాన్ని చిన్నారులు తిన లేక పోతున్నారని, ఈ ప్రభావం వారి ఆరోగ్యంపై పడుతోందని గుర్తించిన ప్రభుత్వం ఈమేరకు సన్నబియ్యం పంపిణీ చేయనుంది. ఇప్పటికే గురుకుల విద్యాలయాలు, పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలకు రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం సరఫరా చేస్తోంది. ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో జిల్లాలో చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది.

57,023 మందికి లబ్ధి..

ఆరోగ్యలక్ష్మి పథకం కింద గర్భిణులు, బాలింతలు, పిల్లలకు కేంద్రాల్లో ఒకపూట సంపూర్ణ భోజనం అందజేస్తున్నారు. వీటికి అదనంగా ఉడికించిన కోడిగుడ్డు, 200 మి.లీ పాలు సరఫరా చేస్తున్నారు. ఏడు నెలల నుంచి 3 ఏళ్ల లోపు పిల్లలకు నెలకు సరిపడే బాలామృతం అనే పోషకాహారాన్ని, నెలకు 16 గుడ్లు ఇంటికి పంపిస్తున్నారు. దీనికి తోడు అదనంగా కేంద్రాల ఆవరణలో పెరటి తోటల పెంపకాన్ని చేపట్టారు. ఇది మంచి ఫలితాలను ఇచ్చింది. అంగన్‌వాడీల్లో నెలకు 75,655 కిలోల బియ్యం వినియోగిస్తున్నారు. దొడ్డు బియ్యం నిల్వలు పూర్తకాగానే సన్న బియ్యాన్ని పంపిణీ చేయనున్నారు. ఇందుకు సంబంధించిన చెల్లింపులు కూడా పూర్తి అయ్యాయి. ఇక అమలే తరువాయి. నాలుగు నియోజకవర్గాలు, 475 గ్రామ పంచాయతీల పరిధిలోని 57,023 మందికి సన్న బియ్యంతో ప్రయోజనం చేకూరనుంది.

లబ్ధిదారులకు మేలు కలుగుతుంది



ప్రభుత్వ అంగన్‌వాడీ కేంద్రాలకు సన్న బియ్యం సరఫరా చేయనుంది. దీంతో లబ్ధిదారులకు ఎంతో మేలు కలుగుతుంది. కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య పెరగడంతో పాటు, సన్న బియ్యాన్ని తినడానికి వారు ఆసక్తి చూపుతారు. తద్వారా వారి ఆరోగ్య పరిరక్షణ విషయంలో స్పష్టమైన తేడా వస్తుంది. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే అమలు చేస్తాం.

– జ్యోతిపద్మ, జిల్లా సంక్షేమ అధికారిణి, సూర్యాపేట

మట్టపల్లి క్షేత్రంలో నృసింహుడి నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని గురువారం అర్చకులు వేదమంత్రాలతో వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యఅగ్నిహోత్రి, మూలవిరాట్‌స్వామికి పంచామృతాభిషేకం చేశారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి, రాజ్యలక్ష్మి చెంచులక్ష్మి అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చనలు గావించారు. కల్యాణతంతులో భాగంగా ప్రధాన ఆలయంలోని ముఖమండపంలో నూతన పట్టు వస్త్రాలతో స్వామిఅమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్లమహోత్సవ సంవాదం చేపట్టారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహ వచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మధుపర్క పూజ, మాంగల్య ధారణ, తలంబ్రాలతో కల్యాణతంతు ముగించారు. కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్తలు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణా చార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.

మూడు విడతల్లో టీకా

- చిన్నారులు, గర్భిణుల వ్యాక్సినేషన్‌కు మిషన్ ఇంద్రధనుష్
- కొనసాగుతున్న మొదటి విడత కార్యక్రమం
- వ్యాధులు సోకకుండా వైద్య ఆరోగ్యశాఖ చర్యలు
- 1040 మంది చిన్నారులు, 301 మంది గర్భిణులే లక్ష్యం
- వివరాలన్నీ యూ విన్ యాప్‌లో నిక్షిప్తం



శిశువుకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

తిరుమలగిరి (తుంగతుర్తి): మాతా, శిశు మరణాలను తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. ఇందులో భాగంగా ఐదేళ్లలోపు చిన్నారులతోపాటు గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు వేసేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఇంద్రధనుష్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మొదటి విడత సోమవారం నుంచి ప్రారంభమైంది. పోలియో, ధనుర్వాతం, క్షయ, తట్టు తదితర వ్యాధులతో పాటు ఇన్‌ఫెక్షన్ సోకకుండా ముందస్తుగా టీకాలు వేస్తున్నారు. వివిధ కారణాలతో టీకాలు వేసుకోని 1,341 మంది గర్భిణులు, చిన్నారులను గుర్తించి టీకాలు వేసే కార్యక్రమాన్ని చేపట్టారు.

పీహెచ్‌సీలు, యూహెచ్‌సీలలో..

జిల్లాలో మిషన్ ఇంద్ర ధనుష్ కార్యక్రమాన్ని ఆగస్టు నెలలో 7వ తేదీ నుంచి 12 వరకు, సెప్టెంబర్ నెలలో 11 నుంచి 16వ తేదీ వరకు, అక్టోబర్‌లో 9 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించేలా వైద్య ఆరోగ్య శాఖ కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. అప్పుడే పుట్టిన పిల్లల నుంచి 5 సంవత్సరాల పిల్లలతో పాటు గర్భిణులకు పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో ఆరోగ్య కార్యకర్తలు టీకాలు వేస్తా రు. జిల్లాలో వివిధ కారణాలతో టీకాలు వేసుకోని వారు 1040 మంది చిన్నారులు, 301మంది గర్భిణులు ఉన్నట్లు గురించారు. ఇంద్రధనుష్‌లో భాగంగా గర్భిణులకు టీడీ (టెటానస్‌అండ్ డిఫ్తీరియా), చిన్నారులకు టీబీ, పోలియో, హెపటైటిస్‌బి, రోటావైరస్, నిమోకోకల్ న్యుమోనియా, మీజిల్స్, రుబెల్లా, జపనీస్ ఎన్‌సెఫలిస్ టీకాలు వేస్తున్నారు.

టీకాలు వేయనున్న వారి వివరాలు

కేటగిరీ	లక్ష్యం
0-1 సంవత్సరం పిల్లలు	367 మంది
1-2 సంవత్సరాల పిల్లలు	270 మంది
2-5 సంవత్సరాల పిల్లలు	403 మంది
గర్భిణులు	301 మంది

అందుబాటులోకి యూ విన్ యాప్

కేంద్ర ప్రభుత్వం మిషన్ ఇంద్ర ధనుష్ కార్యక్రమంలో భాగంగా యూనివర్సల్ ఇమ్యూనైజేషన్ కింద యూ విన్‌యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. కోవిడ్ తరహాలో టీకా వేసుకున్న వారికి డోసులు, తేదీ, సమయం, ఏ టీకా వేశారో సులభంగా తెలుసుకునేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది. గర్భిణులు, పిల్లలకు వేసే పలు రకాల టీకాలను ఇంటర్నెట్‌లో పొందు పరుస్తున్నారు. ఏ ప్రాంతానికి వెళ్లినా ఆధార్, సెల్ నంబర్ నమోదు చేయగానే టీకా వివరాలు సులభంగా తెలుసుకోవచ్చు. మళ్లీ టీకా ఎప్పుడు తీసుకోవాలో బాధితుల సెల్‌ఫోన్‌కు మెసేజ్ వస్తుంది. వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో టీకా వేసుకోవచ్చు. కొత్త విధానంతో కార్డు అవసరం లేకుండానే ప్రత్యేక సంఖ్య ఆధారంగా సులభంగా సేవలు పొందవచ్చు. ఈ నెల 7నుంచి గర్భిణులు, శిశువుల వివరాలను ఇందులో నమోదు చేస్తున్నారు.

టీకాలు వేసే కార్యక్రమం కొనసాగుతోంది



జిల్లాలో ఇంద్రధనుష్ కింద టీకాలు వేసే కార్యక్రమం కొనసాగుతోంది. గర్భిణులు, చిన్నారులకు వ్యాక్సిన్ వేస్తున్నాం. ఈ వివరాలన్నీ కొత్తగా అందుబాటులోకి తీసుకొచ్చిన యూ విన్ యాప్‌లో నమోదు చేస్తున్నాం. ఈ యాప్‌పై సిబ్బందికి శిక్షణ ఇస్తున్నాం. దేశ వ్యాప్తంగా ఎక్కడి నుంచి అయినా టీకా తీసుకోవడానికి ఈ యాప్ ఉపయోగపడుతుంది.

– డాక్టర్ వెంకటరమణ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి

క్లుప్తంగా

వేర్వేరు చోట్ల ఇద్దరు వ్యక్తులు అదృశ్యం

చౌటుప్పల్: పట్టణంలోని కంఠమహేశ్వరస్వామి కాలనీలో నివాసముండే వ్యక్తి అదృశ్యమైనట్లు గురువారం ఫిర్యాదు అందిందని సీఐ దేవేందర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండల పరిధిలోని చింతలగూడెం గ్రామానికి చెందిన కొమిరెల్లి రాజశేఖర్ చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని కంఠమహేశ్వరస్వామి కాలనీలో నివాసముంటున్నాడు. దేవేందర్ బుధవారం తన స్వగ్రామంలోని పొలం వద్దకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం అతడి తల్లి కళమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మిర్యాలగూడలో మరొకరు..


అదావత్ సక్రు

మిర్యాలగూడ అర్బన్: అనారోగ్యంతో మిర్యాలగూడ ప్రభుత్వ ఆస్పత్రిలో చేరిన వృద్ధుడు ఆస్పత్రి నుంచి అదృశ్యమయ్యాడు. మిర్యాలగూడ టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలంలోని గేరితండాకు చెందిన అదావత్ సక్రు అనారోగ్యంతో ఈ నెల 8వ తేదీన మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో చేరాడు. 9వ తేదీ ఉదయం ఆస్పత్రి నుంచి బయటకు వెళ్లిన సక్రు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సక్రు కుమారుడు అదావత్ మహేందర్ గురువారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు


పులిపాటి జ్యోతి

చండూరు(గట్టుప్పల్): మహిళ అదృశ్యమైనట్లు గురువారం చండూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గట్టుప్పల్ మండల కేంద్రానికి చెందిన పులిపాటి జ్యోతి గత నెల 24వ తేదీన నల్లగొండ జిల్లా కేంద్రానికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె తల్లి పులిపాటి సత్తెమ్మ గురువారం చండూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయితే జ్యోతి 20ఏళ్ల క్రితమే తన భర్తతో విడిపోయి తల్లి వద్దనే ఉంటూ చేనేత పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. కాగా చండూరుకు చెందిన రావిరాల వెంకటేశం తన భార్యతో విడిపోయి గట్టుప్పల్ మండల కేంద్రంలోనే ఉంటూ చేనేత మగ్గం నేస్తూ జీవిస్తున్నాడు. అతడి పైనే అనుమానం ఉందని జ్యోతి తల్లి ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన డీసీఎం.. ఒకరు మృతి

చిలుకూరు: బైక్‌ను ఎదురుగా వస్తున్న డీసీఎం ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన గురువారం రాత్రి చిలుకూరు మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు.. ఆత్మకూరు(ఎస్) మండల కేంద్రానికి చెందిన నాగేశ్వరరావు దంపతులు ఉద్యోగ రీత్యా హుజూర్‌నగర్‌లో నివాసముంటున్నారు. గురువారం రాత్రి నాగేశ్వరరావు కోదాడ నుంచి హుజూర్‌నగర్‌కు బైక్‌పై వెళ్తుండగా చిలుకూరు మండల కేంద్రంలోని హరిజనవాడ సమీపంలో గల పెట్రోల్ బంక్ వద్దకు రాగానే హుజూర్‌నగర్ వైపు నుంచి ఎదురుగా వస్తున్న డీసీఎం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడి తలకు తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని 108 వాహనంలో మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జేఎల్‌ఎం పోస్టుల భర్తీకి కసరత్తు

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 335 పోస్టులు ఖాళీ
- ఇప్పటికే పోల్ క్లైంబింగ్ పరీక్ష తేదీలు ఖరారు
- ఆయా తేదీల్లోనే సర్టిఫికెట్ల పరిశీలన
- షెడ్యూల్ విడుదల చేసిన టీఎస్‌ఎస్‌పీడీసీఎల్
- 1:2 నిష్పత్తిలో 671 మంది అభ్యర్థులకు టెస్ట్



నల్లగొండ: విద్యుత్ శాఖలో జూనియర్ లైన్‌మెన్ (జేఎల్‌ఎం)ల నియామకానికి ఆ శాఖ కసరత్తు మొదలుపెట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే పోల్ క్లైంబింగ్, సర్టిఫికెట్ల పరిశీలన కోసం టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ అధికారులు మార్గదర్శకాలు విడుదల చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 335 జేఎల్‌ఎం పోస్టులను భర్తీ చేసేందుకు 1.2 నిష్పత్తిలో అభ్యర్థులను పోల్ క్లైంబింగ్ టెస్టుకు ఆహ్వానించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను కూడా ప్రకటించారు. ఇందులో భాగంగా జిల్లాల వారీగా అభ్యర్థులకు పోల్ క్లైంబింగ్ పరీక్ష నిర్వహించి అదే రోజు సర్టిఫికెట్ల పరిశీలన చేస్తారు. ఇందులో సాధించిన మార్కుల ఆధారంగా అర్హులైన అభ్యర్థులను జేఎల్‌ఎం ఉద్యోగాలకు ఎంపిక చేస్తారు.

జిల్లాల వారీగా పోస్టుల వివరాలు, పరీక్ష తేదీలు ఇలా..

- నల్లగొండ జిల్లాలో 134 జేఎల్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందుకోసం 268 మంది అభ్యర్థులను 1:2 నిష్పత్తిలో ఇంటర్వ్యూకు పిలిచారు. జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో ఉన్న డీఈ కార్యాలయంలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో అభ్యర్థులకు పోల్ క్లైంబింగ్ పరీక్ష నిర్వహిస్తారు. అనంతరం టెస్ట్‌లో పాసైన అభ్యర్థుల సర్టిఫికెట్లను ఆయా తేదీల్లోనే పరిశీలిస్తారు.
- సూర్యాపేట జిల్లాలో మొత్తం 110 పోస్టులు ఉండగా 1:2 నిష్పత్తిలో 220 మంది అభ్యర్థులను పోల్ క్లైంబింగ్ టెస్ట్‌కు ఆహ్వానించారు. సెప్టెంబర్ 1, 2 తేదీల్లో పోల్ క్లైంబింగ్ టెస్టులు నిర్వహించిన అనంతరం వారి సర్టిఫికెట్లు పరిశీలిస్తారు.
- యాదాద్రి భువనగిరి జిల్లాకు సంబంధించి మొత్తం జూనియర్ లైన్‌మెన్ పోస్టులు 91 ఖాళీగా ఉండగా 1:2 నిష్పత్తి ప్రకారం 183 మందిని పోల్ క్లైంబింగ్ టెస్ట్‌కు పిలిచారు. వీరందరికి సెప్టెంబర్ 4, 5 తేదీల్లో టెస్ట్ నిర్వహించి వారి సర్టిఫికెట్లు పరిశీలించనున్నారు.

ఎంపిక కమిటీ నియామకం..

పోల్ క్లైంబింగ్ పరీక్షలో పాల్గొనే అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఇప్పటికే ఓ కమిటీని నియమించారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో పోల్ క్లైంబింగ్‌లో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించిన అనంతరం ఉద్యోగాలకు ఎంపిక చేస్తారు. ఈ ఎంపిక కమిటీ చైర్మన్‌గా సీజీఎం పాండ్యా, ఉమ్మడి జిల్లా కన్వీనర్‌గా నల్లగొండ ఎస్‌ఈ టీఆర్.చంద్రమోహన్, సభ్యులుగా నల్లగొండ డీఈ (టెక్నికల్) రవికాంత్‌శర్మతో పాటు సూర్యాపేట, యాదాద్రి జిల్లాల డీఈలను నియమించారు. అదేవిధంగా కార్యదర్శిగా అసిస్టెంట్ సెక్రటరీ రవీంద్రనాథ్ వ్యవహరించనున్నారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి పోల్ క్లైంబింగ్ నిర్వహించిన తర్వాత అందుకు సంబంధించిన ఫలితాలను విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు పంపనున్నారు.

ఎన్నికలకు ముందే ఇవ్వాలి



పోల్ క్లైంబింగ్ టెస్టుకు హాజరయ్యే అభ్యర్థులకు ప్రాక్టీస్ చేసే విషయంలో 1104 యూనియన్ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుంది. అభ్యర్థులంతా పట్టుదలతో ప్రాక్టీస్ చేసి టెస్టులో అర్హత సాధించాలి. ప్రభుత్వం కూడా పోల్ క్లైంబింగ్ టెస్టు పూర్తయిన వెంటనే ఎన్నికల షెడ్యూల్ రాకముందే నియామక ఉత్తర్వులు ఇవ్వాలి.

– వెంకటయ్య, 1104 యూనియన్ నల్లగొండ జిల్లా కార్యదర్శి

డిజిటల్ టెక్నాలజీతో మెరుగైన సేవలు

- సుధా కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్


మాట్లాడుతున్న బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్

సూర్యాపేట : డిజిటల్ టెక్నాలజీతో సుధా కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తున్నట్లు బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్ అన్నారు. గురువారం సూర్యాపేట పట్టణంలోని త్రివేణి ఫంక్షన్‌హాల్‌లో సుధా కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ 24వ వార్షిక మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్షిక నివేదికలో బ్యాంక్ పనివిధానాన్ని సమీక్షించి వాటాదారులకు 15శాతం డివిడెంట్ ప్రకటిస్తున్నట్లు తెలిపారు. సుధాబ్యాంక్ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్ వివిధ తీర్మానాలు ప్రవేశపెట్టగా.. సభికులు ఆమోదించారు. బ్యాంక్ లాభం గతేడాది కంటే 30శాతం పెరిగిందని, బ్యాంక్ నిరర్ధక ఆస్తులు సున్నాగా ఉండటం మెరుగైన పనితీరుకు నిదర్శనంగా పేర్కొన్నారు. వైస్ చైర్మన్ పోనుగోటి నిర్మల మాట్లాడుతూ.. మహిళలు బ్యాంకింగ్ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొని రోజువారీ చిల్లర ఖర్చులకు ఫోన్ ద్వారా చెల్లించే సౌకర్యాలను పొందవచ్చన్నారు. డైరెక్టర్ ఏపూరి శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఆస్తి పత్రాలు, లింక్ డాక్యుమెంట్లు, ఇంటి పన్ను రశీదులు ప్రతి సంవత్సరం భద్రపర్చినట్లయితే భవిష్యత్తులో అవన్నీ ఉపయోగపడతాయన్నారు. సమావేశంలో డైరెక్టర్లు అనంతుల ప్రభాకర్, కామ్లేకర్ శంకర్‌లాల్, డాక్టర్ మీలా సందీప్, కక్కిరేణి చంద్రశేఖర్, బానావత్ సుజాత, వాటాదారులు పెద్దిరెడ్డి రాజా, అప్పం శ్రీనివాస్, అడ్వకేట్ దంతాల శ్రీనివాస్‌నాయుడు, అనంతుల కృపాకర్, చామల అశోక్‌కుమార్, గుడిపాటి అంజయ్య, కోటగిరి రాధాకృష్ణ, కక్కిరేణి మోహన్, తోట శ్యాంప్రసాద్, గెల్లి అంజన్‌ప్రసాద్, గుండా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదకు ఆర్థికసాయం

సాక్షి ఎఫెక్ట్..


వెంకన్నకు ఆర్థిక సాయం అందజేస్తున్న మేదరి సంఘం నాయకులు

అర్వపల్లి: కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న అర్వపల్లికి చెందిన దివ్యాంగుడు పెరసాని వెంకన్న గురించి 'నిరుపేదకు ప్రాణభిక్ష పెట్టరూ' శీర్షికన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి దాతలు స్పందిస్తున్నారు. ఈ మేరకు సూర్యాపేట, నల్లగొండ జిల్లాల మేదరి(మహేంద్ర) సంఘాల బాధ్యులు స్పందించి గురువారం అర్వపల్లికి వచ్చి ఆపరేషన్ నిమిత్తం వెంకన్నను రూ.77 వేలు ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించారు. వెంకన్నతో పాటు అతడి తల్లి సోమమ్మకు దుస్తులు బట్టలు అందజేశారు. అవసరమైతే మరింతసాయం తమ సంఘం తరఫున అందిస్తామని సూర్యాపేట, నల్లగొండ జిల్లాల మేదరి సంఘం అధ్యక్షులు సులువ యాదగిరి, నోముల రవి తెలిపారు. వెంకన్న దీనగాథను వెలుగులోకి తెచ్చిన సాక్షి దినపత్రికకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో రెండు జిల్లాల కార్యదర్శులు కోన మల్లయ్య, నోముల నరేందర్, ఆయా జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్లు కె. వెంకన్న, ఎస్. వెంకటేశ్వర్లు, శేర్ల వెంకన్న, కె. తిరుపతయ్య, కె. జగదీష్, కోన ఆండాలు, కల్లూరి శోభారాణి, కల్లూరి మురళీకృష్ణ, సులువ చంద్రశేఖర్, నవీన్ పాల్గొన్నారు.

మద్యానికి బానిసై గీత కార్మికుడి బలవన్మరణం


సత్తయ్య (ఫైల్)

చిట్యాల: మద్యానికి బానిసైన ఓ గీత కార్మికుడు మద్యం తాగేందుకు ఎవరూ డబ్బులు ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురై చెట్టుకు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి గ్రామ శివారులో గురువారం చోటు చేసుకుంది. చిట్యాల ఎస్‌ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దకాపర్తి గ్రామానికి చెందిన కల్లు గీత కార్మికుడు పోట్లపల్లి సత్తయ్య(63) ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. కాగా గురువారం ఉదయం సత్తయ్య వద్ద మద్యం తాగేందుకు డబ్బులు లేక తనకు తెలిసిన వారిని డబ్బులు అడగగా ఎవరూ ఇవ్వలేదు. దీంతో ఆయన మనస్తాపానికి గురైన అతడు పెద్దకాపర్తి గ్రామ శివారులో వేప చెట్టుకు తాడుతో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా.. చిట్యాల ఎస్‌ఐ ఇరుగు రవి ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడికి భార్య దుర్గమ్మ, ముగ్గురు కుమారులున్నారు. మృతుడి కుమారుడు రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్ల గొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఆత్మకూరు(ఎం): మండలంలోని లింగరాజుపల్లిలో బుధవారం సాయంత్రం తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగరాజుపల్లి గ్రామానికి చెందిన అంబోజు అబ్బయ్య బుధవారం తన ఇంటికి తాళం వేసి గ్రామ సమీపంలో ఫంక్షన్‌హాల్‌లో పనిచేయడానికి వెళ్లాడు. అతడి భార్య భారతమ్మ కూలీ పనికి వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి తాళం పగలగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి పరిశీలించగా బీరువాలోని అర తులం బంగారం, రూ.10వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

పందెం గిత్తల జత ఖరీదు రూ.కోటి


పందెం గిత్తలతో అమ్మిన, కొనుగోలు చేసిన వ్యక్తులు

హుజూర్‌నగర్: పందెం గిత్తలపై ఉన్న మోజుతో జత గిత్తలను రూ.కోటి పెట్టి కొనుగోలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా కొల్లూరు మండలం అనంతారం గ్రామానికి చెందిన సజ్జ సతీష్, దావులూరి వెంకట సుధాకర్‌లు హుజూర్‌నగర్‌కు చెందిన సుంకి సురేందర్‌రెడ్డి వద్ద పందెం గిత్తలను కొనుగోలు చేశారు. సురేందర్‌రెడ్డి హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ విజిలెన్స్ విభాగంలో అడిషనల్ ఎస్పీగా పనిచేస్తున్నారు. ఆయన చాలా కాలంగా గిత్తలను పెంచుతున్నారు. ఎడ్ల పందేలలో పాల్గొంటూ ఎన్నో బహుమతులు కూడా పొందారు. ఈ గిత్తలను కొనుగోలు చేసిన వారు వాటిని అందంగా అలంకరించి గురువారం ప్రత్యేక వాహనంలో వారి స్వగ్రామానికి తీసుకెళ్లారు. పందెం గిత్తలపై ఉన్న మోజుతోనే రూ.కొట్టి పెట్టి కొనుగోలు చేశామని దావులూరి వెంకట సుధాకర్ చెప్పారు. తమకు ఎద్దులు, వ్యవసాయం ఎంతో ఇష్టమని, ఎద్దుల పందేలలో పాల్గొనడం తమకు మక్కువని చెప్పారు.

రైలు పట్టాలపై వ్యక్తి మృతదేహం లభ్యం


రాజేష్ (ఫైల్)

మిర్యాలగూడ టౌన్: దామరచర్ల మండలం కొండ్రపోలు గ్రామ పంచాయతీ పరిధిలోని రాళ్లవాగుతండా వద్ద గురువారం రైలు పట్టాలపై వ్యక్తి మృతదేహం లభ్యమైంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అడవిదేవులపల్లి మండలం ఉల్సాయిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని కాలువకట్టకు చెందిన పోలేపల్లి రాజేష్(32) మిర్యాలగూడ పట్టణంలోని ప్రకాశ్‌నగర్‌లో కొంతకాలంగా నివాసముంటున్నాడు. పోలేపల్లి రాజేష్ త్రిపురారం మండలంలోని పెద్దదేవులపల్లిలో గల రెడ్డీస్ ల్యాబ్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తుండగా, అతడి భార్య అనూష ఆశ వర్కర్‌గా పని చేస్తుంది. రాజేష్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కాగా ఈ నెల 7వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాజేష్ తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా దామరచర్ల మండలం రాళ్లవాగుతండా వద్ద గురువారం రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు నల్లగొండ రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే హెడ్ కానిస్టేబుల్ రజిత, కానిస్టేబుల్ శంకర్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహం వద్ద దొరికిన సెల్‌ఫోన్ సహాయంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా.. మృతుడు పాలేపల్లి రాజేష్‌గా గుర్తించారు. మృతుడికి ఇద్దరు పిల్ల లున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్‌ఐ సాలకమ్మ తెలిపారు.

అదుపుతప్పిన స్కూల్ బస్సు

- విద్యార్థులు సురక్షితం

చింతపల్లి: ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు విద్యార్థులను ఎక్కించుకొని పాఠశాలకు వెళ్తుండగా మార్గమధ్యలో అదుపుతప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. వివరాలు.. చింతపల్లి మండల కేంద్రంలోని నాగార్జున గ్రామర్ స్కూల్ బస్సు నెల్వలపల్లి, ఉప్పరపల్లి గ్రామాల్లో విద్యార్థులను ఎక్కించుకొని పాఠశాలకు వెళ్తుండగా మార్గమధ్యలో నసర్లపల్లి మూలమలుపు వద్ద అదుపుతప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన సమయంలోబస్సులో సుమారు 30మంది విద్యార్థులు ఉండగా.. ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో తల్లి దండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

మోత్కూరు: మండలంలోని రాగిబావి గ్రామానికి చెందిన ఎలుగు సత్తిరెడ్డి ఇల్లు గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ ప్రమాదంలో ఇంట్లోని భూమి పట్టాదారు పాసుపుస్తకాలు, రూ.3లక్షల నగదు, ఇతర సామగ్రి కాలిబూడిదయ్యాయని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.


కాలిపోయిన ఇంట్లోని సామగ్రి

ప్రభుత్వం విద్యారంగాన్ని పరిరక్షించాలి


అభివాదం చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

రామన్నపేట: ప్రభుత్వం విద్యారంగాన్ని పరిరక్షించాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎల్.మూర్తి అన్నారు. జిల్లాలో ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ–సంక్షేమ హాస్టళ్ల పరిరక్షణ కోసం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో చేపట్టిన సమరభేరి సైకిల్‌యాత్ర గురువారం రామన్నపేటకు చేరింది. స్థానిక విద్యార్థి సంఘం నాయకులు యాత్రకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విద్యారంగం అస్తవ్యస్తంగా తయారైందని కనీస సౌకర్యాలు, బోధకులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. మన ఊరు–మన బడి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో మేడబోయిన మమత, బుర్రు అనిల్, వనం రాజు, బొడ్డుపల్లి వెంకటేశం, మేకల జలేందర్, బండ్ల పవన్, ఎల్.రాజు, వేముల నాగరాజు, రాహుల్, బుగ్గ ఉదయ్, గంటిపాక శ్రీకృష్ణ, సురేష్, కంబాలపల్లి సాయి, పుట్టల ఉదయ్, బుగ్గ ఉదయ్, వెంకట్, ఆకాష్, జ్యోతిబసు తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య


ఘటనా స్థలం వద్దే మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తున్న డాక్టర్లు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన తిరుమలగిరి మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన నాగేండ్ల శేఖర్‌రెడ్డి(40) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలం నుంచి అతడి మానసికస్థితి సరిగ్గా ఉండటం లేదు. ఈ క్రమంలో ఈ నెల 4వ తేదీన అతడు ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు వారికి తెలిసిన వాళ్ల ఇళ్లలో వెతికినా ఆచూకీ దొరకలేదు. కాగా గురువారం ఉదయం రంగుండ్ల తండా శివారులోని వ్యవసాయ భూముల వద్ద చెట్టుకు ఉరేసుకొని వేసుకొని ఓ వ్యక్తి చనిపోయినట్లు అటుగా వెళ్లిన వారు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఘటనా స్థలానికి వెళ్లిన ఎస్‌ఐ సురేష్ మృతదేహాన్ని పరిశీలించి మృతుడు నాగేండ్ల శేఖర్‌రెడ్డిగా గుర్తించారు. మృతదేహం కుళ్లిపోయి, దుర్వాసన వస్తుండడంతో ఘటన జరిగి నాలుగు నుంచి ఐదు రోజులు అవుతుండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఘటనా స్థలం వద్దే మృతదేహానికి పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి తల్లి శాంభమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

బేడబుడిగ జంగాలకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలి


నియామకపత్రం అందజేస్తున్న పర్వతం గిరి

భూదాన్‌పోచంపల్లి: బేడబుడిగ జంగాలకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చి సంక్షేమ పథకాలను అమలు చేయాలని బేడ బుడిగ జంగాల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పర్వతం గిరి అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ బేడబుడిగ జంగాలకు ప్రభుత్వం నుంచి సరైన గుర్తింపులేక ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వెనుకబాటుకు గురవుతున్నారని అన్నారు. బేడి బుడిగజంగాల సంక్షేమానికి కృషి చేసే పార్టీలు, నాయకులకే రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో తమ మద్దతు ఉంటుందని తెలిపారు. అనంతరం మండల, పట్టణ శాఖ నూతనకమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు మండల అధ్యక్షుడిగా రెవెల్లి యాదగిరి, ఉపాధ్యక్షుడిగా కప్పెర అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా రెవెల్లి ప్రభాకర్, మున్సిపల్ పట్టణ అధ్యక్షుడిగా కొండపల్లి పెద్ద యాదగిరి, ప్రధానకార్యదర్శిగా దుద్దుకూరి ఈశ్వర్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కళ్లెం వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు కెళ్లం ముత్తు, గౌరవ అధ్యక్షుడు రెవెల్లి యాదగిరి, ఉపాధ్యక్షుడు కప్పెర బిక్షపతి, ప్రధానకార్యదర్శి తుర్పాటి రాములు, నాయకులు పర్వతం రంగయ్య, రెవెల్లిసాలయ్య, కొండపల్లి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

కోదాడరూరల్: లారీ ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన కోదాడ మండలంలోని ఎర్రవరం గ్రామ స్టేజీ వద్ద గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన పాట్టా శ్రీనివాస్(36) మేళ్లచెర్వు మండలంలోని కందిబండ శివారులో గల ముత్యాలమ్మ ఆలయం వద్దకు బైక్‌పై వెళ్తున్నాడు. మార్గమధ్యలో ఎర్రవరం గ్రామ స్టేజీ వద్దకు వెళ్లగానే మేళ్లచెర్వు వైపు నుంచి వస్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ తీవ్రంగా గాయపడడంతో స్థానికులు చికిత్స నిమిత్తం అతడిని కోదాడకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య కోటేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోదాడ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్కూల్ బస్సు ఢీకొని బాలుడి దుర్మరణం


జశ్వంత్ మృతదేహం

నిడమనూరు: స్కూల్ బస్సు ఢీకొని మూడేళ్ల బాలుడు మృతిచెందిన ఘటన నిడమనూరు మండలంలోని మార్లగడ్డ క్యాంపు వద్ద గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ గోపాల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మార్లగడ్డ క్యాంపులో నివాసముండే లొట్టిపల్లి ఈదయ్య గురువారం ఉదయం తన పెద్ద మనవడు యశ్వంత్‌ను స్కూల్ బస్సు ఎక్కించాడు. అదే సమయంలో ఇంటి నుంచి బయటికి వచ్చిన అతడి చిన్న మనువడు జశ్వంత్(3) బస్సు ముందు వైపు రాగా.. అది గమనించని డ్రైవర్ వీసాల నవీన్ బస్సును ముందుకు పోనిచ్చాడు. దీంతో బస్సు జశ్వంత్‌కు తగలడంతో కొద్దిదూరాన ఎగిరిపడ్డాడు. తీవ్ర గాయాలపాలైన జశ్వంత్‌ను వెంటనే మిర్యాలగూడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. బాలుడి తండ్రి అనుముల మధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోపాల్‌రావు తెలిపారు.

ఇద్దరు విద్యార్థుల మధ్య ఘర్షణ

- ఒకరికి కత్తిపోట్లు

చింతపల్లి: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థుల మధ్య గురువారం చోటుచేసుకున్న ఘర్షణలో ఓ విద్యార్థి మరో విద్యార్థిపై కత్తితో దాడి చేశాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ ఫస్టియర్ చదువుతున్న చింతపల్లి మండల కేంద్రానికి చెందిన విద్యార్థి అదే పాఠశాలలో ఇంటర్మీడియట్ సెకండియర్ చదువుతున్న వింజమూరు గ్రామానికి చెందిన విద్యార్థి గురువారం సాయంత్రం పాఠశాల పక్కనే ఉన్న స్థలంలో గొడవ పడ్డారు. ఈ క్రమంలో సెకండియర్ విద్యార్థి కత్తితో ఫస్టియర్ విద్యార్థిపై దాడి చేశాడు. దీంతో తీవ్ర గాయాలపాలైన ఆ విద్యార్థిని వెంటనే మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సతీష్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

గుండె గు'బిల్లు'


రూ.35,291 చూపిస్తున్న బిల్లు

ఆలేరురూరల్: పట్టణ కేంద్రంలోని క్రాంతినగర్‌కు చెందిన బాలలక్ష్మి అద్దె ఇంట్లో ఉంటోంది. గురువారం విద్యుత్ సిబ్బంది కరెంటు బిల్లు ఇవ్వగా.. జూలై నెలలో రూ.35,291 బిల్లు వచ్చింది. ఇంత బిల్లు రావడం ఏమిటని ఆమె సిబ్బందిని ప్రశ్నించింది. ఇంత బిల్లు ఎలా కట్టాలని వాపోయింది.

రైస్ పుల్లింగ్ పేరిట మోసం

- నలుగురిపై కేసు నమోదు
- ఇందులో ముగ్గురి అరెస్ట్, పరారీలో మరొకరు


నిందితుడు సంజీవరావును అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఆలేరురూరల్: రైస్ పుల్లింగ్ పేరిట మోసాలకు పాల్పడుతున్న ఆలేరు మండలంలోని శారాజీపేటకు చెందిన ముగ్గురు, జనగామ జిల్లాకు చెందిన ఒకరిపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. గురువారం ఎస్‌ఐ జి. వెంకటశ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు మండలం శారాజీపేటకు చెందిన మిట్టపల్లి సంజీవరావు తన కుమార్తె సౌజన్య పేరిట ఉన్న భూమి విక్రయించే క్రమంలో హనుమకొండకు చెందిన వాకిటి చంద్రారెడ్డితో పరిచయం ఏర్పడింది. అప్పటికే సంజీవరావు రైస్ పుల్లింగ్ పేరుతో మోసాలకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో తనకు అతీంద్ర శక్తులు ఉన్నాయని, రాగి పాత్రలో అద్భుతాలు సృష్టిస్తానని, స్వల్ప పెట్టుబడితో అనతి కాలంలోనే కోట్లకు పడగలెత్తవచ్చని చెప్పడంతో చంద్రారెడ్డి రెండు దఫాలుగా రూ.30లక్షల నగదును సంజీవరావుకు ఇచ్చాడు. కొద్దిరోజుల తర్వాత తాను మోసపోయానని గ్రహించిన చంద్రారెడ్డి ఈ నెల 7వ తేదీన ఆలేరు పోలీస్ స్టేషన్‌లో సంజీవరావుపై ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ప్రత్యేక ఎస్‌ఓటీ బృందం సంజీవరావు ఇంటిపై దాడి చేసి రైస్ పుల్లింగ్‌లో ఉపయోగించే రాగి పాత్ర, రూ.40వేల నగదు, 4 తులాల బంగారు నగలు, కారు స్వాధీనం చేసుకున్నారు. సంజీవరావు, అతడి భార్య కోమలాదేవి, కుమార్తె సౌజన్యతో పాటు వీరికి సహకరించిన జనగామకు చెందిన ఎర్రోజు మదన్‌మోహన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మదన్‌మోహన్ పరారీలో ఉండగా.. ముగ్గురిని కోర్టులో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు.